

1[illegible]—[illegible]—70

'ఆడవాళ్ళు ఒకే ఒక రహస్యాన్ని దాచగలరు — అది వాళ్ళవయస్సును —' అన్నాను అరుంధతితో కాఫీలదగ్గర.

ఈ మాటలు నేనెందు కంటున్నానో అరుంధతికి తెలుసు—

అంచేత—నేను 'రిటార్ట్' కోసం ఎదురు చూస్తున్నాను—కాని—అరుంధతి ఏం మాట్లాడలేదు ఆ మాటలు అనవి గురించి కాదన్నట్టు కాఫీ త్రాగుతూ కిటికీ లోంచి చూస్తూ ఏదో ఆలోచిస్తోంది.

నిజానికి—అరుంధతితో నా పరిచయం ఇవాల్టిది కాదు. అరుంధతితో నా జ్ఞాపకాలు త్రవ్వుకోవాలంటే చరిత్ర పాతికేళ్ళు వెనక్కి నడవాలి — ఈ పాతికేళ్ళలో దేశమూ, మనుషులం అందరం మారిపోయాం.

'చూడు కృష్ణమూర్తీ !— హైదరాబాద్ లో ఇంకా ఎన్నాళ్ళు వుంటావన్నావు?—' హఠాత్తుగా అంది అరుంధతి ప్రసంగం మారుస్తూ.

'బహుశా రెండురోజుల్లో ఆఫీస్‌పని పూర్తయి పోవచ్చు ననుకుంటాను — కనీసం అప్పటిలోగా నయినా...' మధ్యలో ఆగిపోయాను.

'తప్పకుండా — పెళ్లి ముహూర్తం కూడా ఎప్పుడో చెప్పేస్తాను—సరేనా! —' అంది నవ్వుతూ అరుంధతి

కాని—ఆ నవ్వు నన్ను మరింత సస్పెన్స్‌లోపెట్టి చంపింది.

* * *

అరుంధతి గురించి చెప్పాను గానీ — పాతికేళ్ల క్రిందటి అరుంధతిగురించి చెప్పలేదు—అవి నేను మద్రాసులో చదువుకునే రోజులు.

అప్పట్లో అరుంధతి చాలా నాజూగ్గా వుండేది—

అందమైన ఆమె ముక్కు క్రింద నాజూగ్గా విరిసే నవ్వులో ఇప్పటికీ ఏమీ మార్పు రాలేదు గానీ—ఆ కళ్ల వెలుగులో మాత్రం మార్పు వచ్చింది. అదీకూడా కొద్దిగానే—

ఇక—అనాటి పంజాబీడ్రెస్ స్థానంలో వచ్చిన చీర—రెండు జడలకు బదులుగా చోటుచేసుకున్న బర్మాముడి, ఆమె అందాన్ని తగ్గించాయా, హెచ్చుచేశాయా, అని అడిగితే నేను చెప్పలేను.

అరుంధతితోబాటు నేనుకూడా వయస్సులో ఎదగడం ఇందుకు ఒక కారణం అయినా కావచ్చు—

ఏది ఏమైనా — అప్పట్లో మట్టుకు ఎదురింటి రిటైర్డు తాసిల్దార్‌గారి అమ్మాయిపేరు అరుంధతి అని తెలుసుకున్న తర్వాత కొంచెం 'డిసప్పాయింట్' అయ్యాను. ఎందుకంటే — ఇంత అందమైన అమ్మాయికి అంతకన్నా మంచిపేరు వుండాలనిపించింది. అందుకని — ఏదో ముద్దుపేరుకూడా ఒకటి పెట్టుకున్నాను — అయితే ఇప్పుడది జ్ఞాపకంలేదు.

నిజానికి — అరుంధతితో నాకు పరిచయం కావడానికి నేను 'హీరోయిజమ్' ఏదీ చూపించాల్సిన అవసరం లేకపోయింది—

ఒకరోజు రిటైర్డు తాసిల్దార్‌గారు కనబడి 'ఏమయ్యా—నువ్వు భావగీతాలు రాస్తావట నిజమేనా ?—' అని నిలదీసి అడిగాడు రోడ్డుమీద—

కానిపని చేస్తున్నానని నడిరోడ్డుమీద నాలుగు అక్షింతలు వేస్తాడేమో అనుకున్నాను. (ఆ రోజుల్లో భావకవుల్ని విమర్శించడం ఓ సాంప్రదాయంగా వుండేది.) కాని—అలాంటిదేమీ చెయ్యలేదు. పైగా—'నేను రిటైరైపోయి ముసలాణ్ణని ముద్ర వేసుకున్నానుగానీ నా భావాలన్నీ యువతరానివేనోయ్—' అంటూ భరోసా ఇచ్చాడు—కృష్ణశాస్త్రిని పట్టుకుని ఆకాశంలోకి ఎత్తేశాడు—

నిజం చెప్పొద్దూ— ఆయన్ని చూస్తే ముచ్చటేసింది. ఇంత సాహిత్యపిపాస వున్న మనిషి రెవిన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఎంత అవస్థపడి పోయాడో కదా పాపం అనిపించింది.

కాసేపు—రోడ్డు ప్రక్కన సాహిత్యచర్చ జరిగిన తర్వాత— 'వో ఆదివారం వీలు చూసుకుని మాయింటికి తీరుబడిగా రా—' అని ఆహ్వానించడంతో మామూలుగా కథల్లో రాసేట్టుగానే నేను రంగంలోనికి ప్రవేశించాను—

అరుంధతిది చాలా విచిత్రమైన మనస్తత్వం. ఏ విషయాన్నయినా ఆమె ఎంత సీరియస్‌గా తీసుకోగలదో అంత 'లైట్'గా కూడా తీసుకోగలదు—వో విషయంమీద కాసేపు ఆవేశంగా మాట్లాడి ఆ తర్వాత దానిమీదే 'జోక్' వేసి అందరితో బాటు తనూ నవ్వేది—మొదటిలో ఈ ప్రవర్తన చిత్రంగా కనబడినా—ఆ తర్వాత అలవాటయి పోయింది.

అందుచేతనే — ఆమె భావకవుల్ని తిట్టినా — ఆ తర్వాత ఎంకిపాటల్ని పాడినా — పెద్ద తేడా గమనించలేని స్థితికి వచ్చాను.

ఏది ఏమయినా— అరుంధతిది కమ్మటి గాత్రం.

అప్పట్లో ఆమె పాడిన జయదేవుడి అష్టపదుల్నీ, క్షేత్రయ్య పదాల్నీ నేనే నాటికి మరచిపోలేను—

మొత్తానికి—అరుంధతికి చాలా ఆదర్శాలు, అభిప్రాయాలూ వున్నాయి. అయితే—వయస్సు చిన్నదికావడం వల్లనో మేధ పరిపక్వతకు రానందునో ఏదీ స్థిరంకాకుండా విచిత్రంగా వుండి పోయాయి.

బహుశా ఇందువల్లనే కాబోలు రిటైర్డు తాసిల్దార్ రామేశంగారు ఒకటి రెండుసార్లు నాతో అన్నారు-'ఈఅమ్మాయి నాకోసమస్య కృష్ణమూర్తీ!— కాలానికి పది అడుగులముందు నడిచేవాళ్లను లోకం ఎప్పుడూ వేలెత్తి చూపిస్తుంది—కాని, అందులోనిబాధ అరుంధతికి తెలియదు—' రామేశంగారి ఆవేదన అప్పట్లో నాకు అర్థం కాలేదు. ఆమాటలు అర్థం కావడానికి నాకు మరో పదిహేను రోజులు పట్టింది—అరుంధతి ఇంటికి వెడుతున్నానని తెలియగానే కాలేజిలో మాక్లాస్‌మెట్సంతా —'ఎన్నో నెంబరు గురూనీది—' అంటూ వేళాకోళం చెయ్యడం ప్రారంభించారు. మొదటిలో వాళ్ళమాటలను నేను అన్యాయంగా కొట్టిపారేశాముగానీ ఆ తర్వాత పరిస్థితి అర్థమైంది.

రామేశం గారింటికి ఎప్పుడూ ఏవో మొగపురుగులు వస్తూనే వుండేవి—వాళ్లందరూ రామేశంగారికోసం వస్తున్నారనుకునే వాడిని మొదటిలో—కాని ఆ తర్వాత అసలు విషయం తెలిసింది—

శర్మ, సీతాపతి, మాధవమూర్తి, కాంతారావు, వీళ్లందరూ నాకు అరుంధతి 'బోయ్‌ఫ్రెండ్స్—' గా పరిచయం అయ్యారు. శర్మ ఎం. బి. బి. యస్. రెండో సంవత్సరం చదువుతున్నాడు—

మాధవమూర్తి ఫస్ట్ ఆనర్స్‌లో వున్నాడు. సీతాపతి రెవిన్యూ ఇన్‌స్పెక్టరుగా పని చేస్తున్నాడు—కాంతారావు—ఇంటర్ మీడియేట్ ఫెయిలయి ఆ తర్వాత వేషాల కోసమని స్టూడియోల చుట్టూ తిరుగుతున్నాడు.

వీళ్ళందరూ నాకన్నా వయస్సులో పెద్దవాళ్ళు—అందుచేత నేను కొంచెం 'రిజర్వ్‌డ్'గానే వుండేవాణ్ని—

వాళ్ళల్లో మాధవమూర్తి మాత్రం కొంచెం సన్నిహితంగా వుండేవాడు. మనసు విప్పి మాట్లాడ్డానికి తను ప్రయత్నించి నాకు అవకాశమిచ్చేవాడు — అరుంధతిని పెళ్ళి చేసుకోవాలని కోరికగా వున్నట్టు మాధవమూర్తి వోసారి నాతో అన్నాడు. అంతేకాదు—శర్మా, సీతాపతీ, కాంతారావు కూడా అరుంధతి మీద అలాంటి అభిప్రాయంలోనే వున్నారని అయితే అరుంధతి మాత్రం తనని తప్ప మరెవరినీ పెళ్ళి చేసుకోదని చెప్పాడు—ఈమాటలు అతగాడు నాతో ఎందుకు చెప్పాల్సి వచ్చిందో నాకు అర్థం కాలేదు. 'నువ్వు ఏమన్నా వేరే ఉద్దేశాలు పెట్టుకుంటున్నావేమో జాగ్రత్త' అని చెప్పడానికి మొహమాట పడి మాధవమూర్తి సున్నితంగా ఇలా చెప్పాడనుకున్నాను. ఏది ఏమయినా— అరుంధతిమీద ఎలాంటి అభిప్రాయం ఏర్పరుచుకోడానికి అవకాశం లేదప్పటికి. 'అలాంటి భయం ఏమీ లేదులే' అని

# సప్తపది

చెప్పబోయి తమాయించుకున్నాను.

ఇది జరిగిన తర్వాత—వారంరోజులకు కాబోలు బీచిలో అరుంధతి మాధవమూర్తితో కనబడింది. ఆ తర్వాత ఇలాంటి సంఘటనలు అనేకం నేను చూడటం కాని—వినడంకాని—జరిగాయి.

వీటిని దృష్టిలో వుంచుకునే కాబోలు వోసారి నాతో అంది అరుంధతి—'చూడు కృష్ణమూర్తీ!—నేను మాధవమూర్తిని పెళ్ళి చేసుకుంటే తప్పా?—అతని కులం, గోత్రం ఏ మయితే పై వాళ్ళకెందుకు? శర్మ, సీతాపతి, దీన్ని పెద్ద రాద్ధాంతం చెయ్యాలని ఎందుకు చూస్తున్నారో నా కర్థం కావడంలేదు. ఇది నా వ్యక్తిగత విషయం—'

ఇది విన్నవెంటనే నాకు ముందు కలిగిన భావం మాధవమూర్తి మీద 'జలసీ'యే అయినప్పటికీ—దాన్ని తమాయించుకుని అతగాడిని మనస్ఫూర్తిగా అభినందించగల కనీస సంస్కారం నాలోంచి అప్పటికి ఇంకా పోలేదు.

ఇంతలో ఇంటర్మీడియేట్ పరీక్షలు ముంచుకు రావడంలో—ఇక — అరుంధతీ ప్రేమాయణానికి 'గుడ్‌బై' చెప్పి చదువులో మునిగిపోవాల్సి వచ్చింది.

సెలవలకి మాయింటికి వెళ్ళిపోతూ 'పెళ్ళికి ఇన్విటేషను పంపకపోతే వూరుకోను —' అన్నాను అరుంధతితో.

'బావుంది—ముహూర్తం పెట్టగానే వెంటనే ఎక్స్‌ప్రెస్ డెలివరీలో నీకు ఉత్తరం రాయనూ—' అంది అరుంధతి.

* * *

—ఆ తర్వాత మా నాన్నగారికి చిత్తూరునించి విశాఖపట్టణం ట్రాన్స్‌ఫర్ అయిపోవడంతో మద్రాసుతో సంబంధం తెగిపోయింది — నా చదువు మద్రాసునించి విశాఖకు మకాం మార్చింది. ఈ మధ్యకాలంలో అరుంధతినించి వెడ్డింగు కార్డుగానీ, ఉత్తరంగానీ రాలేదు. దాదాపుగా అరుంధతిని మరచి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కాలగమనంలో పది సంవత్సరాలు దొర్లిపోయాయి.

ఈలోగా మన దేశానికి స్వతంత్రం రావడం—స్వతంత్ర జీవితంలో నేను పాతుకు పోవడం అన్నీ జరిగిపోయాయి.

అనుకోకుండా రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో అరుంధతి కనబడింది. బాగా చలిగా వుందేమో మఫ్లర్ చుట్టుకుంది. 'ఏమండోయ్!—కృష్ణమూర్తిగారూ!—మేం గుర్తున్నామా?—' అంటూ నవ్వుతూ పలకరించింది.

ఎలా మరచిపోతాను అరుంధతిని?—

'నువ్వు ఈ వూళ్ళో వుంటున్నావా?' అన్నాను ఆశ్చర్యంగా—

'లేదు — బంధువులింట్లో పెళ్ళి వుంటే వచ్చాను—అయితే నువ్వు ఇక్కడ వుద్యోగం వెలిగిస్తున్నావన్నమాట!!—' అంది.


'అవును — ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను—' అంటూ నాకథ చెప్పుకున్నాను.

ఇద్దరమూ ఒకే కంపార్ట్‌మెంటులో కూర్చున్నాము. బండి కదులుతూండగా అన్నాను—'మాధవమూర్తిగారు రాలేదా?'

దానికి అరుంధతి నొసలు చిట్లించి—'ఏ మాధవమూర్తి?—'అంది.

ఆ మాటలకు నేను తెల్లబోయాను. 'అదేమిటి? — నువ్వు మాధవమూర్తిగారిని పెళ్ళిచేసుకోలేదా?' అన్నాను ఆశ్చర్యంగా.

'ఛ!—ఆ బ్రాహ్మణ సంగతి నాకు



చెప్పకు. నా దగ్గిర అన్ని గొప్పలు చెప్పి ఆ తర్వాత అమ్మా, నాన్నా, పద్దన్న దగ్గ మొహం చాటేశాడు — ఒట్టి పిరికిసన్నాసి!—' అంది.

అప్పుడు అర్థమైంది నాకు — అరుంధతినించి ఎందుకు శుభలేఖ రాలేదో.

'అయితే — నువ్వు పెళ్లి చేసుకో లేదన్న మాట !—' అన్నాను.

'బాగుంది నీ సందేహం. మా ధనమూర్తి తప్పించి ప్రపంచంలో మొగవాళ్లు లేరా — విక్షేపంలా పెళ్లి చేసుకున్నాను—'

'ఎవర్ని ?—' కుతూహలాన్ని చంపుకోలేక పోయాను. 'ఎవరినయితేనేం — పెద్ద పెద్ద డిగ్రీలున్న ఒక మహానుభావుణ్ణి పెళ్లాడాను. అతగాడు ముందు మాకు బంధువుగా పరిచయమయ్యాడు. మంచానపున్న నాన్న ముచ్చటపడితే పెళ్లి చేసుకున్నాను—'

'బావుంది — అయితే సాంప్రదాయమైన పెళ్లి చేసుకున్నావన్నమాట !—'

'—అందుకే దెబ్బతిన్నాను తను చచ్చిపోతూ, చచ్చిపోతూ, మానాన్న నా జీవితంమీద పెద్దదెబ్బ కొట్టిపోయాడు. చదువుకున్నవాడుకదా అనుకున్నాను. కాని — ఇంత సంకుచిత మనస్తత్వంగల మనిషని తెలుసుకోలేక పోయాను. అమెరికా వెళ్లివచ్చిన ఆ పెద్దమనిషి దృష్టిలో ఆడది వంటింటి కుందేలు. గడపదాటి బయటకు రావడానికి వీల్లేదు. రెండేళ్లు ఓపికపట్టి ఇక నావల్లకాక తెగతెంపులు చేసుకుని వచ్చేశాను—'

'విడాకులు ఇచ్చేశావా ?—' అన్నాను తెల్లబోతూ.

'ఏం అంత ఆశ్చర్యపోతున్నావు ?— భారత స్త్రీ విడాకులు ఇవ్వకూడదా?—' అంది రోషంగా.

అరుంధతి మాటలకు కొంచెం తడబడి—'అబ్బెబ్బే — అలాంటిదేమీ లేదు. ఊరికే అన్నాను. అయితే ఇప్పుడు...'

'బెజవాడలో వుంటున్నాను. దేముడి దయవల్ల ఆలిండియా రేడియోలో వుద్యోగం దొరికింది. నాకు ఏం లోటు లేకుండా జరిగిపోతోంది...'

అరుంధతి మాటలకు సంతోషించలేక పోయాను. ఆమె మీద జాలివేసింది. 'అయితే నీ జీవితం ఇంకా స్థిరపడలేదన్న మాట...' అన్నాను బాధగా.

'ఏం చెయ్యమంటావు చెప్పు ?— నీలాంటి నోరులేని జంతువుకోసం వెదుకుతున్నాను. నీకు పెళ్లికాకుంటే చెప్పు మరి...' అంది నవ్వుతూ—

అదిరిపోయాను.

'అబ్బెబ్బే—నాకు ఇద్దరు పిల్లలు—' అన్నాను. నా ఖంగారుచూచి విరగబడి నవ్వింది అరుంధతి.

అరుంధతి నవ్వుతూవుంటే చూస్తూ వుండిపోయాను. కాలగమనంలో పదేళ్లు మాత్రమే గడిచిపోయినా నాలో ఎంతో పెద్దరికం వచ్చింది. కుర్రతనం పూర్తిగా పోయింది. కాని — అరుంధతి ఇంకా పూర్వంలాగానే వుంది — ఇంకా చెప్పాలంటే అప్పటికన్నా అందంగా ఆకర్షణీయంగా వుంది — ఇంత అందమైన ఇల్లాలికి విడాకులు ఇచ్చిన ఆ 'అమెరికా రిటర్న్డ్' మీద చాలా కోపం వచ్చింది.

ఏలూరు స్టేషనులో దిగిపోయాను. నవ్వుతూ చెయ్యి వూపింది అరుంధతి — బండి కదిలిపోతూంటే అరుంధతికి నా ఎడ్రస్ ఇచ్చి ఉత్తరం రాయమని చెబుదామనుకున్నాను. కాని — ఆ కోరిక అలాగే ఉండిపోయింది.

* * *

చూస్తుండగానే పన్నెండేళ్లు జరిగిపోయాయి. అప్పటికి నేను ఒక ప్రయివేట్ కంపెనీకి టెక్నికల్ ఎడ్వయిజర్‌గా వున్నాను.

ఉద్యోగంలో హోదాలో ఎదిగాను.


వయస్సు పెరిగింది.

తల్లో తెల్లవెంట్రుకలు చోటు చేసుకున్నాయి. కళ్లకు పెద్ద కళ్లజోడు వచ్చేసింది.

ముసలివాణ్ణి అయ్యానని ఎవరన్నా అంటే ఒప్పుకోనుగానీ — బాగా పెద్దతరహా వచ్చేసింది.

ఈ పరిస్థితుల్లో హైదరాబాద్‌కి కంపెనీపనిమీద వచ్చి సాయంత్రంపూట మా ఆఖరి 'ఎడిషన్'కి సూపర్ బజార్‌లో బొమ్మలు కొంటూవుండగా — 'ఎవరికి బొమ్మలు ? — పిల్లలకా ? — మనవలకా ?—' అనే గొంతు వినబడింది.

వెనుతిరిగి చూచేసరికి 'షాక్' తిన్నాను. నవ్వుతూ కనబడింది అరుంధతి ! — జన్మలో మళ్లీ అరుంధతిని చూస్తాననుకోలేదు. చూచినా — చాలా బాగా పెద్దరికం వచ్చి వుంటుందనుకున్నాను. కాని — అరుంధతిలో పెద్ద మార్పేమీ లేదు. కాస్త పెరిగిన శరీరాన్ని — కళ్ల



క్రింద ఏర్పడిన గీతల్ని — మినహాయిస్తే, అరుంధతిలో చెప్పుకోదగ్గ మార్పు ఏమీ లేదు. ఇప్పటికీ ఆమెలో ఆకర్షణ వుంది — క్లియోపాత్రా జ్ఞాపకం వచ్చింది — 'ఏజ్ కెనాట్ విదర్ హెర్ నార్ కస్టమ్స్ స్టేల్ హెర్ ఇన్‌ఫినిట్ వెరైటీ!'

'ఏమిటలా చూస్తున్నావు? — మతి మరుపుగానీ వచ్చిందా?' — అంది.

'బొత్తిగా ఈ వయస్సుకే అలా అయిపోయావేమిటి? — ఆ జుట్టుకు కాస్త రంగు వేసుకోకూడదూ—' అని పరస మాడింది.

అచేతనంగా వింటూ వుండిపోయాను.

అరుంధతికి హైదరాబాద్ స్టేషన్‌కి ట్రాన్స్‌ఫర్ అయిందట — తన ఇంటికి తీసుకు వెళ్ళింది — వాళ్ళ ఇంట్లోనే భోంచేసి ఆ రాత్రికి అక్కడే వుండిపొమ్మంది. అరుంధతి ఆహ్వానాన్ని నేను ఒప్పుకోకుండా వుందామన్నా మనస్సు తిరగబడింది, నా కాళ్ళూ చేతులూ కట్టేసి నోరు మూసుకుని అరుంధతి చెప్పినట్టు విను—' అని మనస్సు డబాయించింది. ఇక — చేసేదిలేక ఆపూట వాళ్ళింట్లోనే భోంచేసి రాత్రికి అక్కడే పడుకున్నాను.



అరుంధతి అస్తమానూ మాట్లాడుతూనే వుంది.

మనుషులందరూ దురాశపరులట —

ఒక్కడికీ 'మొరాలిటీ' లేదుట —

అందులో మొగవాళ్ళను అసలు నమ్మకూడదట —

ఆడవాళ్ళను ఎలా గౌరవించాలో మొగాడికి ససేమిరా తెలియదుట — వింటూ వుండిపోయాను నేను —

మాటల మధ్యలో అంది అరుంధతి — 'త్వరలో నేను పెళ్ళి చేసుకోబోతున్నాను —' అని.

'మళ్ళీ పెళ్ళా? —' అనబోయి అరుంధతికి భయపడి నాలిక్కొరుక్కున్నాను. 'ఏమిటీ? —' అని మాత్రం అనగలిగాను.

'అవును — అయితే వివరాలేవీ అడగొద్దు — ప్రస్తుతానికి ఇంతే — మిగతా విషయాలన్నీ వెండితెరమీద చూచి తెలుసుకోవాల్సిందే —' నవ్వుతోంది అరుంధతి.

* * *

ఆ రాత్రి ఎందుకో నాకు నిద్ర పట్టలేదు.

అరుంధతి ఇంట్లో పడుకోవడమే అందుకు కారణం అనుకుంటాను.

సిగరెట్ ముట్టించి కాసేపు అరుంధతి కాబోయే భర్తగురించి ఆలోచించాను —

ఆలోచించిన కొద్దీ అరుంధతి అదృష్టం చేతులో పెరిగిపోయింది. లేకపోతే ఈ వయస్సులో అరుంధతికి పెళ్ళేమిటి? — నన్ను ఆడిద్దామని కాకపోతే —

ఈ ఆలోచన ఎందుకో నాకు సంతృప్తి నిచ్చింది.

సిగరెట్ పారేసి మంచంమీద పడుకున్నాను — మనస్సెందుకో కొత్తెలా వుంది — గుండెల్లో ఏదో గందరగోళంగా వుంది —

కళ్ళముందు అరుంధతి అందమైన ముఖం కనబడుతోంది —

కళ్ళు చింతనిప్పులై పోతున్నాయి.

పాతికేళ్ళుగా నిగ్రహించుకున్న కోరిక వెన్ను తడుతోంది —

'ఛ! — నేను బ్రూట్‌ని కాను —' నాలో నేను గొణుక్కున్నాను.

గదిలోవున్న టేబిల్ గడియారం పన్నెండుగంటలు చూపిస్తోంది.

ఇంకో సిగరెట్ తీశాను. కాని — కాల్చబుద్ధి వేయలేదు — రెండుసార్లు పీల్చి అవతలకు పారేశాను — శర్మ, సీతాపతి, కాంతారావు, మాధవమూర్తి, జ్ఞాపకం వచ్చారు. వాళ్ళందరికన్నా తీసిపోయానా నేను? —


మెల్లిగా తలుపు తీసి బయటకు నడిచాను. ఎదురుగా వుంది అరుంధతి గది. గది తలుపుకూడా వేసిలేదు. లోపల ఫేన్ తిరుగుతున్న చప్పుడు మాత్రం వినబడుతోంది. గుండెల్ని దిటవు చేసుకుని ముందుకు నడుస్తున్నాను —

ఇంతలో అరుంధతి గదిలో లైట్ వెలిగింది — గదిలోంచి బయటకు వస్తూ నవ్వుమొహంతో నవ్వుతూ అంది అరుంధతి.

'ఏం — కృష్ణమూర్తీ! — నిద్రపోలేదా నువ్వు? — లేక నిద్రలో వాకింగ్ చేస్తున్నావా? —'

ఆ పలకరింపుకు నాతల తిరిగిపోయింది. ఏదో కానిపని చేస్తూ 'రెడ్‌హేండెడ్'గా దొరికిపోయినట్టయింది —

'అబ్బెబ్బే — అదేంలేదు —' అన్నాను —



'ఏదిలేదు?—' విరగబడి నవ్వింది అరుంధతి.

అరుంధతి నవ్వు చూస్తూంటే నాకు భయం కూడా వేసింది.

'అది సరేగాని—బాగా రాత్రవుతోంది. బుద్ధిగా నీగదిలోకి వెళ్ళి పడుకో — గుడ్‌నైట్ — విష్‌యు స్వీట్‌డ్రీమ్స్—' అంటూ తన గదికి తలుపు వేసేసింది అరుంధతి.

అరుంధతి మాటలకు నాలోని 'అహం' అనే పదార్థం వాలా 'అప్పడం' అయిపోయాడు.

అరుంధతి మాటల్లో నాకు — 'రాస్కెల్—అరుంధతితో వెలగట పెడుతున్నావా?—జాగ్రత్త!—' అనే బెదిరింపు వినిపించింది.

నాలో ఎన్నాళ్ళనించో పెరిగి పెద్దదవుతున్న 'మొరాలిటీ' నన్ను చూచి జాలిగా నవ్వింది.

చెప్పలేని బాధ — ఏడవాలనిపిస్తోంది— అరుంధతిని చంపేయాలనిపిస్తోంది — మనుషులెవరికీ కనబడకుండా హిమాలయాలకి పారిపోవాలనిపిస్తోంది.

అరుంధతిలాంటి మనిషిముందు నా 'మొరాలిటీ' ఎందుకూ పనికిరాకుండా పోయిందనే బాధ నా గుండెల్ని రంపపు కోత పెడుతోంది.

'మహా పతివ్రతలా బయలుదేరింది పెళ్ళి చేసుకుంటుందట—పెళ్ళి—' కసిగా గొణుక్కున్నాను.

* * *

ఆ ప్రక్కరోజున ఆఫీస్ పనిచేసుకుని మా కంపెనీ గెస్ట్‌హౌస్‌కు తిరిగి వెడుతూ కింగ్ కోఠిలోని తాజ్‌మహల్ 'హోటల్ దగ్గర టేక్సీని ఆపుచేయించాను. హోటల్ లోపలకు వెడుతూండగా శర్మ కనబడ్డాడు.

నన్ను చూడగానే వాడు క్షణం విస్మితుడై నిలబడిపోయి—


'నన్ను గుర్తుపట్టారా?—' అన్నాడు అతి ప్రయత్నం మీద—

నేను శర్మని మరచిపోలేదు—

అతనిప్పుడు ఉస్మానియా హాస్పటల్లో డాక్టర్‌గా పనిచేస్తున్నాడట. నాతోపాటు అతనూ హోటల్లోకి వచ్చాడు.

కోకాకోలా సిప్ చేస్తూ అన్నాను—

'అరుంధతి కూడా ఈ వూళ్ళోనే



వుంది—తెలుసనుకుంటాను—'

'తెలుసు—ఆవిడను మీరు మీట్ య్యారా?—'

మాట్లాడలేదు నేను—

'మీకు తెలుసో తెలియదో అరుంధతి మరో క్రొత్త ప్రేమాయణం ప్రారంభించింది—'—అన్నాడు శర్మ.

'ప్రేమాయణమా?—' అన్నాను అర్థం కాక—

'అవును—యూనివర్శిటీలో డాక్టర్ వరప్రసాదరావని ఒక పొలిటిక్స్ ప్రొఫెసరున్నాడు — అతగాడు ఇప్పుడు మీ అరుంధతికి తాజా ప్రియుడు—అతగాడిని అరుంధతి పెళ్లి చేసుకుంటుందని కూడా విన్నాను—'

'పొలిటిక్స్ ప్రొఫెసర్ వరప్రసాదరావా?—' అన్నాను ఆశ్చర్యపోతూ—

'అవును అతగాడు మీకు తెలుసా?—'

'తెలియక పోవడమేమిటి?—వైజాగులో చదువుకునే రోజుల్లో అతనూ నేనూ బాగా స్నేహితులం—మా యింటి ప్రక్కనే వుండేవాడు—అయినా అతనికి ఇదివరకే పెళ్లి అయిందని విన్నాను, ఇప్పుడు మళ్లీ పెళ్లి ఎందుకు చేసుకోవలసి వచ్చిందో నాకు అర్థం కావడం లేదు—'

ప్రొఫెసర్‌ని నేను ఎరుగుదు నన్న విషయం తెలియగానే శర్మ ముఖంలో వెలుగు కనబడింది—'అయితే వెంటనే వెళ్లి అతగాడితో చెప్పండి. అరుంధతి లాంటి క్లియోపాత్రాను పెళ్లి చేసుకుని సుఖపడలేడని—'

అరుంధతి మీద శర్మకు ఇంకా ఎందుకు ఇంత కక్షో నాకు అర్థం కాలేదు. అతడి మాటల్లో నాకు సంస్కారం కనబడలేదు.

# సప్తపది

'ఇది అన్యాయం—' అన్నాను కోపంగా.

'పోనివ్వు—కాని, మీ మిత్రుడయిన అవతలి వ్యక్తి గురించి కూడా మీరు ఆలోచించాలి—' అన్నాడు శర్మ—

శర్మ కసితో అంటున్నాడు — శర్మలా నాకు అరుంధతి మీద కసి లేదు. ప్రసాదరావు దగ్గర అరుంధతి గురించి చెప్పాల్సిన అవసరం నాకు లేదు.

అయినా — ఎందుకో నాకు ప్రసాదరావును చూడాలనిపిస్తోంది. ఇన్నాళ్లుగా హైదరాబాద్ వస్తున్నా ఎప్పుడూ నాకు అతడిని కలవాలనిపించలేదు. కాని—ఇప్పటి పరిస్థితి వేరు. ఏదో తెలియని శక్తి నన్ను ప్రసాదరావు ఇంటివేపు తోస్తోంది.

టాక్సీని యూనివర్సిటీ స్టాఫ్ క్వార్టర్స్ వైపు పోనిమ్మన్నాను. డాక్టర్ ప్రసాదరావు ఇల్లు చాలా నిరాడంబరంగా వున్నా, 'నీట్'గా వుంది—డ్రాయింగ్ రూమ్‌లో వున్న సోఫాలో కూర్చున్నాను.

వరప్రసాదరావును చూచి దాదాపు ఇరవై ఏళ్లు అవుతుంది. ఇప్పుడు ఎవరి గట్టుకు మాట్లాడడం— మాట్లాడాలని బయలుదేరడం—నాకే చిత్రంగా వుంది— నా మనసుకు ఇష్టంలేని పనులు ఈ మధ్య చాలా చేస్తున్నాననిపించింది.

నేను కూర్చున్న మరో రెండు నిముషాలకు ఓ అందమైన యువతి హాల్లోకి వచ్చి 'ఫేన్ 'ఆన్' చేసి 'డాడీ స్నానం చేస్తున్నారు—కూర్చోండి—' అంది.

ప్రసాదరావుకు ఇంత పెద్ద కూతురుందన్న మాట! — అయినా పెళ్లికి ఆయారవుతున్నాడు!—ఛి—ఛీ—ఏం మనిషి?—అనిపించింది—ప్రసాదరావు కూతురును చూడటం అదే ప్రథమమయినా ముఖం ఎందుకో సుపరిచితమైనదానిలాగే వుంది—అయితే ఎప్పుడు ఎక్కడ చూసానో మాత్రం గుర్తు పట్టలేకపోయాను. మరో మూడు నిముషాల్లో ప్రసాదరావు రానే వచ్చాడు—ఓ నిముషం తటపటాయించిన తర్వాత నన్ను గుర్తు పట్టాడు—

'కృష్ణమూర్తీ!—నువ్వు చాలా మారిపోయావు—ఏమిటి ఇంత లావైపోయావు—నిన్ను చూస్తుంటే నాకూ అనుమానం వేస్తోంది—నేను కూడా మారిపోయానేమో నని—' అన్నాడు ప్రసాదరావు తన బట్ట తలను నిమురుకుంటూ—

'చిన్ననాటి రోజులు తలుచుకుంటే చాలా చిత్రంగా వుంటుంది—మనం వార్ధక్యంలోకి ఎంత త్వరగా ప్రవేశిస్తున్నాం అనిపిస్తూ వుంటుంది—' అన్నాడు ప్రసాదరావు.

'అయినప్పుడు ఇప్పుడీ పెళ్లి ఎందుకు?' —అని అడగాలనిపించింది—కాని, నా నోటి నుంచి ఈ ప్రశ్న వచ్చేలోపుగానే గుమ్మం దగ్గర అడుగుల చప్పుడు వినబడింది.

'హాహా!— కృష్ణమూర్తి కూడా ఇక్కడే వున్నాడే!—' అంటూ లోపలికి వచ్చింది అరుంధతి.

అరుంధతిని చూడగానే నా గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. నా తడబాటును అణచుకుంటూ—'అవునవును — ప్రసాదరావు నా బాల్యస్నేహితుడు—' అన్నాను.

అది విని నవ్వుతూ అంది అరుంధతి—'నీకు అంతే తెలుసు—మరి కొంచెం చెబుతాను విను—ఈయన నా భర్త—'

'దీని గొప్ప తగలెయ్య—అప్పుడే పెళ్లి అయినట్లు సంబర పడుతుంది' అనుకున్నాను.


ఇంతలో లోపలినించి ఇందాకటి అమ్మాయి పరిగెట్టుకు వచ్చింది. 'హలో—మమ్మీ—' అంటూ—

సమయం చిక్కింది నాకు—

'ఓహో!—నీ కాబోయే కూతురన్న మాట!—' అన్నాను కసిగా 'జోక్' వేస్తూ—

దానికి గంభీరంగా నవ్వింది అరుంధతి—'నా కాబోయే కూతురు—కన్నకూతురు!'

[illegible]



'—ఇక ఇప్పుడయినా అసలు సంగతి నీకు చెప్పక తప్పదు కృష్ణమూర్తీ!—ప్రసాదరావుగారు ఇదివరలో నన్ను అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భర్త. మా రెండేళ్ళ దాంపత్య జీవితంలో లభించిన వరం ఈ 'సుచరిత' — ఆలిండియా రేడియోలో పాటలు పాడటానికి వచ్చి నాకు ఈ సుచరిత పరిచయం అయింది. ఆ తర్వాత అసలు విషయం తెలిసింది. ప్రొఫెసర్ గారిని కలుసుకున్నాను. నాటినుంచి పెళ్ళి చేసుకోకుండా వుండిపోయిన ప్రొఫెసర్ గారిని చూస్తే నా హృదయం ద్రవించిపోయింది—నా పొరబాటు తెలుసుకున్నాను. ప్రొఫెసర్‌గారు తన అభిప్రాయాల పంజరంలోంచి నాలుగడుగులు ముందుకు వచ్చారు జీవితంలో నేర్చుకున్న పాఠాలు నా అభిప్రాయాలనించి నన్ను మూడడుగులు వెనక్కి నడిపించాయి — విచిత్రమైన రీతిలో సప్తపది పూర్తయింది—మా ఇద్దరి అభిప్రాయాలూ ఇప్పుడు ఏకీభవించాయి. నిజానికి — ఈ కాస్మాపాలిటన్ ప్రపంచంలోని మొగాళ్ళను చూస్తే నాకు రోత కలిగింది—నాగరికతను అవకాశంగా తీసుకుందామని చూచే తోడేళ్ళలాటి ఈ మొగజాతంటే నాకు అసహ్యం వేసింది— కొన్నాళ్ళు పోతే—కాగితం పువ్వులాంటి ఈ నాగరికతకు 'గుడ్‌బై' కొట్టి పూర్తిగా ఆర్థొడాక్స్‌గా మారిపోతానేమో కూడా చెప్పలేను— ఏది ఏమయినా—ఇప్పుడు నేను ఆయన్ని మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను—వచ్చే నెలలోనే పెళ్ళి చేసుకోబోతున్నాను — మా పెళ్ళితోబాటే మా సుచరిత తను కోరుకున్న వరుడితో జరగబోతోంది—మా తల్లీ కూతుళ్ల పెళ్ళిళ్ళు ఒక్కసారే జరుగుతున్నాయి—నువ్వు వచ్చి ఆశీర్వదించాలి.'

అరుంధతి మాటలకు ప్రసాదరావుగారు నవ్వుతున్నారు.

నాకు తల తిరిగిపోతోంది—

ఏం మాట్లాడాలో తెలియడం లేదు—

అనవసరంగా భుజాలు తడుముకోవడం నాకిష్టంలేదు—

ముఖం మీద నవ్వు పులుముకోపోతే బావుండదు మరి—

డామిట్!—కథ అడ్డం తిరిగింది!!—

